www.vishalabharati.com
epaper:vishalabharati.com

TELANGANA POLITRICKS

పాలిట్రిక్స్

2023-2024

విశాల భారతి
vishalabharathi Telugu Daily
శనివారం, 28.10.2023
హైదరాబాద్
1.00 pm edition

పాలిట్రిక్స్

ఖర్చు లెక్కపై నిఘా!

రూపాయి ఎక్కువైనా వేటు తప్పదు

రెండు రోజులకోసారి లెక్క చెప్పడం తప్పనిసరి

ఒక అభ్యర్థికి రూ.40 లక్షల వరకే పర్మిషన్

ఖర్చుల పరిమితిని నిర్దేశించిన సీఈసీ

నవంబర్ 3 నుంచి లెక్కలు అమలులోకి..

విశాల భారతి, స్టేట్‌బ్యూరో :

రాష్ట్రవ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల హంగామా ఊపందుకుంది. ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చుల లెక్కలపై పక్కాగా నిఘా వేసేందుకు ఎన్నికల అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీల నాయకులు, అభ్యర్థులు గ్రామాల్లో ఇంటింటి ప్రచారాల్లో దూసుకు పోతున్నారు. అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దాదాపుఅన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, బీజేపీ కూడా నేడో రేపో పూర్తిగా అభ్యర్థులను ప్రకటించేలా ఉంది. దీంతో క్యాండిడేట్లు ఎన్నికల సంగ్రామంలో విజేతలుగా నిలిచేందుకు వ్యూహ, ప్రతివ్యూహాలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో రాజకీయ రంగులు కళకళలాడుతున్నాయి. ఇప్పుడు అన్ని పార్టీల క్యాడర్‌మొత్తం ఎలక్షన్ బిజీలో తలమునకలవుతోంది. ఈ నేపథ్యంలో చీఫ్ ఎలక్షన్‌కమిషన్ (సీఈసీ) కూడా ఈ సారి ఎన్నికలు పక్కాగా నిర్వహించేందుకు రెడీ అయ్యింది. క్యాండిడేట్ల కదలికలు, వారి ఖర్చులపై స్పెషల్‌ఫోకస్‌కోసం టీమ్స్‌ను ఏర్పాటు చేసింది. అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన అభ్యర్థి రూ.40 లక్షలకు మించి ఒక్క రూపాయి కూడా ఎక్కువగా ఖర్చు చేయకూడదనే రూల్‌ను ఎన్నికల సంఘం జారీ చేసింది. క్యాండిడేట్ల ఖర్చుల వివరాలను స్థానికంగా ఖరారు చేసి విధి విధానాలు రూపకల్పన చేసింది. రోజువారీ ఖర్చుల నిర్వహణ సేకరణపై వ్యయ పరిశీలకులను ఏర్పాటు చేసి వాళ్లకు అవసరమైన అవగాహనను కూడా కల్పించింది.

క్యాండిడేట్ల కదలికలపై ఫోకస్

నియోజకవర్గాల్లో ఎన్నికల రణరంగంలో తలపడే అభ్యర్థుల కదలికలపై చీఫ్‌ఎలక్షన్ కమిషన్ నియమించిన షాడో అబ్జర్వేషన్ ఆఫీసర్ల టీమ్ నిరంతరం నిఘా వేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అభ్యర్థుల ప్రచార ర్యాలీలు, ఫ్లెక్సీల ఏర్పాటు, టెంట్ల ఏర్పాటు, సౌండ్ సిస్టం, డీజే పాటలు, కళాకారుల ఆట పాటలు, గుమిగూడిన కార్యకర్తల సంఖ్య, ర్యాలీల్లో వాడుతున్న వెహికల్స్ సంఖ్య, కార్యకర్తలకు భోజనాలు, వాహనాల ఇంధనం ఖర్చుల వివరాలను సేకరించేందుకు ఎన్నికల వ్యయ పరిశీలకులు షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్‌లో పూర్తి వివరాలను నమోదు చేసేందుకు అవసరమైన పకడ్బందీ చర్యలను ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు తీసుకున్నారు. ఇందుకోసం ఎన్నికల సంఘం రూపొందించిన ఖర్చుల పట్టికను కూడా రూపొందించిన జిల్లా ఎన్నికల అధికారులు విడుదల చేశారు.

ఎలక్షన్‌ఖర్చుల ధరల వివరాలు..

ప్రచార సభల్లో 8వేల నుంచి 12వేల జనాభా గల ప్రాంతాల్లో మినీ సభలకు రోజుకు రూ.30,000 నుంచి 50,000, 8వేల లోపు జనాభా గల ప్రాంతాల్లో రూ.10,000 నుంచి 30,000, వినియోగించే ఆంప్లిఫయర్లు, లౌడ్ స్పీకర్లకు రోజుకు రూ.1300, ఎల్ ఈడీ స్క్రీన్లు స్క్వేర్ ఫీట్‌కు రూ.3.70 నుంచి రూ.4, వీఐపీ కుర్చీలు సింగిల్ రూ.270 రోజుకు, డబుల్ కుర్చీ రూ.375, క్లాత్ కట్ ఔట్ రూ.1520, ఫ్లెక్సీ కట్‌ఔట్ (12ఫీట్లు/8ఫీట్లు) రూ.1400, పార్టీ ఎలక్షన్‌ఆఫీస్ కిరాయి మునిసిపల్ కమర్షియల్ రూ.5500, రెసిడెన్షియల్ రూ.3500, రూరల్ కమర్షియల్ రూ.2,500, రెసిడెన్షియల్ రూ.1,500, డ్రైవర్ల వేతనం రోజుకు రూ.200, నెలకు రూ.8500, గెస్ట్‌హౌజ్ ఏసీకి సింగిల్ రూ.1150, డబుల్ రూ.1600, హోటల్ సింగిల్ రూ.450, డబుల్ రూ.800, జీపు ఖర్చు రూ.1400, టెంపోట్రావెల్లర్ రూ.3000, సుమో రూ.1500, ఇన్నోవా రూ.2300, బొలేరో రూ.1800, ఆటో రూ.700, వీడియో కవరేజీ రోజుకు రూ.1850, పూలదండలకు రూ.100, బొకేలు చిన్నవి రూ.120, మీడియం రూ.220, పెద్దవి రూ.500, క్లాత్ టోపీలు రూ.11, ఫోమ్ టోపీలకు రూ.8, రెగ్జిన్ టోపీలకు రూ.35, నెహ్రూ టోపీలకు రూ.20, మైదానం కిరాయి (మునిసిపల్) రూ.1,500, రూరల్ రూ.1,000, ఫంక్షన్ హాల్ రూ.15,000, బల్క్ ఎస్ఎంఎస్‌లు బీఎస్ఎన్ఎల్ 10పైసలు/సెకండ్‌కు, ఇతర నెట్‌వర్క్‌లకు 11పైసలు/సెకనుకు, వాయిస్ రికార్డింగ్ మెసేజ్‌లు నిమిషానికి రూ.2, హోర్డింగ్‌లకు 100 ఎస్ఎఫ్‌టీ నెలకు రూ.1000, సిల్క్ కండువాలకు రూ.30, కాటన్ కండువాకు రూ.5, వీఐపీ కండువాకు రూ.50, భోజనం ఒక్కరికి కూరగాయలు రూ.60, చికెన్ భోజనం రూ.90, మటన్ భోజనం రూ.100, బిర్యానీ రూ.150 లెక్కన ఎన్నికల అధికారులు రూపొందించారు.

రెండు రోజులకోసారి లెక్క చెప్పాల్సిందే..

సీఈసీ గైడ్‌లైన్స్‌ప్రకారం.. ప్రతీ క్యాండిడేట్ తన ఎలక్షన్‌ఖర్చు రూ.40 లక్షల వరకు ఖర్చుపెట్టుకునే పరిమితిని కల్పించింది. అంతకు మించి ఒక్క రూపాయి కూడా ఎక్కువ ఖర్చు చేసినా కూడా ఎలక్షన్ గైడ్‌లైన్స్‌కింద చర్యలకు రెడీ కావాల్సి ఉంటుంది. నవంబరు 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో అదే రోజు నుంచి ఎన్నికల ఖర్చుకు సంబంధించిన లెక్కలను సంబంధిత ఎలక్షన్‌ఆఫీసర్‌కు రెండు రోజులకు ఓసారి లెక్క అప్పగించాల్సిందిగా జిల్లా ఎన్నికల అధికారి ఎలక్షన్‌కోడ్‌గైడ్‌లైన్స్‌జారీ చేశారు. ఒకవేళ ఎన్నికల లెక్కలు అప్పగించడంలో నిర్లక్ష్యం చేస్తే వెంటనే నోటీసులు జారీ చేసేందుకు జిల్లా ఎన్నికల అధికారి చర్యలు చేపడుతారు.

కేసీఆర్‌కు షాకిచ్చేలా హస్తం వ్యూహాలు!

తెలంగాణలో అధికారమే లక్ష్యంగా అడుగులు

గెలుపు సమీకరణలతో సెకండ్ లిస్ట్ రిలీజ్

సర్వేల ఆధారంగానే క్యాండిడేట్స్ ఫైనల్

అందుకే అభ్యర్థుల ప్రకటనలో ఆలస్యం

రెండు, మూడు రోజుల్లో థర్డ్ లిస్ట్

విశాల భారతి, స్టేట్‌బ్యూరో ప్రతినిధి:

"కాంగ్రెస్‌లోకి వరుసగా కొనసాగుతున్న చేరికలు దేనికి సంకేతం? క్యాండిడేట్స్ సెకండ్‌లిస్టును ప్రకటించడంలో ఎందుకు ఆలస్యం? ఇటు వరుస చేరికలు, అటు అభ్యర్థులను ప్రకటించకపోవడం వెనకాల ఉన్న 'హస్తం' పార్టీ వ్యూహం ఏంటీ?' అంటే కేసీఆర్‌కు షాక్‌ఇచ్చేలా కాంగ్రెస్‌ఎన్నికల వ్యూహాలను ఎప్పటికప్పుడు మార్చుకోవడంలో భాగమేనని అర్థమవుతోంది. అందుకే అభ్యర్థుల ప్రకటనలో ఆలస్యమవుతోందని తెలుస్తోంది. ఇప్పటికే బీఆర్ఎస్ తమ సిట్టింగ్ అభ్యర్థుల్ని ప్రకటించి ప్రచారం షురూ చేసింది. కానీ కాంగ్రెస్ మాత్రం ఆచితూచి అడుగులు వేస్తూ ఇప్పటి వరకు 100 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. పాత్తుల్లో భాగంగా కమ్యూనిస్టు పార్టీలు, టీజేఎస్‌తో మరో చర్చించి థర్డ్ లిస్ట్‌కూడా రెండు మూడు రోజుల్లో ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల సెలక్షన్ చేస్తోందని ఆ పార్టీ చేరికలను చూస్తే అర్థమవుతుంది. గతంలో బీఆర్ ఎస్, బీజేపీ నుంచి ఎవరెప్పుడు కాంగ్రెస్‌లోకి వచ్చి వాలుతారా? అని ఎదురు చూడాల్సివచ్చేది. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. బీజేపీ, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌కు జోరుగా వలసలు కొనసాగుతున్నాయి. రాజకీయాలు ఎప్పుడూ ఒకేలా ఉండవనే మాటకి ఈ పరిణామం ఉదాహరణగా చెప్పొచ్చు.

రీసర్వేలనే నమ్ముతున్న హైకమాండ్!

మరోవైపు కేసీఆర్‌కు విరుద్ధంగా అభ్యర్థులని కాకుండా స్కీమ్స్ ని ప్రకటించడం ద్వారా 'గెలిస్తే ఏం చేస్తాం' అని వివరిస్తూ పథకాల్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. టికెట్ల విషయంలో హై కమాండ్ దగ్గర గెలవని అభ్యర్థుల పేరు స్క్రీనింగ్ కమిటీలో ఎవరు సూచించినా వాళ్లు హై కమాండ్ దగ్గర అభాసుపాలు కావల్సిందే అనేలా సునీల్ కనుగోలు గానీ, ప్రియాంక, రాహుల్ గాంధీగానీ చేస్తున్న కసరత్తు అంతా ఇంతా కాదు. టికెట్ ఫలాన వ్యక్తికి ఇవ్వాల్సిందే అని పట్టు పట్టినా అవసరమైతే అతనిపై మళ్లీ రీసర్వే జరిపిస్తున్నారు. ఇంకా ఎన్నికల నోటిఫికేషన్ నాటికి కూడా మిగిలిన 19లో పది సీట్లను కొత్తగా పార్టీలోకి వచ్చేవారి కోసం దాచిపెట్టేప్లాన్‌లో కూడా ఉన్నారని తెలుస్తోంది.. పీసీసీ ప్రెసిడెంట్‌గా, సీఎల్పీ నేతలుగా సొంత మనుషులకు టికెటిప్పించాలని చూసినా అవి రివర్స్‌అయ్యి తిప్పి పంపిస్తోంది హై కమాండ్. ఈ వ్యూహాలు, విపరీత మార్పులు అన్నీ కలిసొచ్చి కాంగ్రెస్‌అధికారాన్ని చేజిక్కించుకునేలా కనిపిస్తోంది.

గెలుపే లక్ష్యంగా గేమ్ ప్లాన్‌చేంజ్..

నిజంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల జాబితా ఎందుకు ఆలస్యమవుతోందంటే మాత్రం గెలుపే లక్ష్యంగా ముందుకు సాగేలా సునీల్ కనుగోలు ఇక్కడ ప్రధాన పాత్ర పోషిస్తున్నట్టు అర్థమవుతుంది. రాష్ట్రం నుంచి స్క్రీనింగ్ కమిటీలో ప్రెసిడెంట్‌గా రేవంత్ రెడ్డి, సీల్పీ నేత భట్టి విక్రమార్క, ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, మధు యాష్కీ, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తో పాటు హైకమాండ్ టీమ్ మరో ముగ్గురు ఉన్నారు. వీరందరూ కలిసినా అన్నిస్థానాల క్యాండిడేట్లను సూచించినా ఎందుకు ఆలస్యం అవుతుంది? అనే ప్రశ్నకు కూడా అనేక సమాధానాలు వినిపిస్తున్నాయి. ఈ కమిటీ కేవలం అభ్యర్థులను నిలబెట్టే సలహాలను మాత్రమే తీసుకుంటున్నట్టుగా కనిపిస్తోంది.

ఇందులో రేవంత్ వర్గమనో, భట్టి వర్గమనో, మరే ఇతర నేతల వర్గమనో హై కమాండ్ స్వీకరించేటట్టు లేనట్టుగా తెలుస్తోంది. వీరిచ్చిన రెండు మూడు పేర్లలో కూడా సరియైన అభ్యర్థులను సూచించారా? లేదా అని సర్వేల రిపోర్ట్స్ చూడడం, దాని ఆధారంగానే హై కమాండ్ అభ్యర్థుల్ని నిర్ణయించడం, గెలవలేని స్థానాలు ఉంటే అవతల పార్టీల్లో నుంచి ఎవరైనా వస్తే గెలవగలుగుతామా అని కూడా పార్టీ లోతుగా పరిశీలిస్తున్నది. అందులో భాగంగానే వరుస చేరికలను పార్టీ ప్రోత్సహిస్తోంది. గతంలో రాహుల్ గాంధీ లాంటి నేతలు ఎమ్మెల్యే స్థాయి నేతలను ఎవరినీ పెద్దగా కలిసేవాళ్లు కాదు. కానీ ఇప్పుడు గెలుపే లక్ష్యంగా పొన్నాల లక్ష్మయ్య లాంటి నేతలతో కూడా మాట్లాడడం పార్టీ గతంలోలాగా పనిచేయడం లేదని అవగతమవుతోంది.

మరోవైపు సీడబ్లూసీ మెంబర్ వంశీచంద్ రెడ్డి లాంటి లీడర్ స్థానంలో కొత్తవారిని తీసుకోవడం అంటే గెలవు కోసం త్యాగం చేయాల్సిందేనని సూచించినట్టు తెలుస్తోంది. ఈ వరుస చేరికలతో రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుస్తుందన్న అవగాహన కూడా క్రియేట్ చేయగలుగుతున్నారు. ఇది గతంలో జరిగిన ఎన్నికల కాలం కాదని స్పష్టంగా కనిపిస్తుంది. గుడ్డెద్దు చేనులో పడ్డ చందంగా ఎంపికలు జరగవని అర్థమవుతుంది. సిఫార్సులకు కాలం చెల్లిందనే సంకేతం కనిపిస్తుంది. గెలుపు తప్ప మరొక విషయానికి ఎంపికల్లో అసలు స్థానం లేదనే ధోరణి హై కమాండ్‌లో స్పష్టంగా కనిపిస్తున్నది.

గులాబీ బాస్‌కు అంతుచిక్కకుండా ఎత్తులు

బీఆర్ఎస్ ఎత్తులకు భిన్నంగా.. అభ్యర్థుల ఎంపిక విషయంలో కాంగ్రెస్ రూటు మార్చింది. అభ్యర్థుల ఎంపిక విషయంలో అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నది. తెలంగాణలో వచ్చిన రెండు ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ ఏ నియోజకవర్గంలో ఎవరికి టికెట్లు ఇస్తున్నారో కేసీఆర్ ముందే ఊహించి ఎత్తులు వేసేవాడు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ అనుసరిస్తున్న వ్యూహాలు మాత్రం అధికార పార్టీకి అంత సులభంగా అంతుచిక్కడం లేదు. గతంలో ఎన్నికల సమయంలో కేసీఆర్ అవతలి పార్టీలను వీక్ చేసి బలం లేని అభ్యర్థులను నిలబెట్టేలా చేసేలా వ్యూహం పన్నేవాడన్న చర్చ కూడా జరిగేది. కానీ ఇప్పుడు దానికి బ్రేక్ పడినట్టే అనిపిస్తుంది. గత ఎన్నికల కాలంలో బీఆర్ఎస్ వేసినఎత్తుగడలను హై కమాండ్ స్టడీ చేసింది. అందుకు తగ్గ జాగ్రత్తలపైనే దృష్టి పెట్టి పనిచేస్తోంది.

అభ్యర్థుల ఎంపికలో ఉత్తమ్ మార్క్!

'కెప్టెన్' టీమ్ మెంబర్లందరికీ టికెట్లు

తన క్యాండిడేట్ల ఎంపికలో పక్కా ప్లాన్‌తో సక్సెస్

పార్టీలో ఎన్ని అడ్డంకులు వచ్చినా పట్టుబట్టి సాధన

20 మందికి పైగా టికెట్లు ఇప్పించుకున్నారని చర్చ

ఉత్తమ్‌పై ఎన్ని విమర్శలు వచ్చినా పీసీసీ చీఫ్‌రేవంత్ రెడ్డి వర్గాన్ని దీటుగా ఎదుర్కోవడంలోనూ ఆయన సక్సెస్ అయ్యారనే చెప్పొచ్చు. ఒక వేళ కాంగ్రెస్‌పార్టీ గెలిస్తే రేవంత్ పైచేయి సాధించకుండా ముందే ఉత్తమ్‌తగిన జాగ్రత్తలు పడుతున్నారని తెలుస్తోంది. రేవంత్‌రెడ్డి వర్గీయులకు చాలా మందికి చెక్ పెట్టడంలో పైచేయి సాధించారన్న టాక్ కాంగ్రెస్‌పార్టీలో జోరుగా నడుస్తోంది.

విశాల భారతి, స్టేట్ బ్యూరో ప్రతినిధి:

కాంగ్రెస్ అంటేనే గ్రూపుల గోల .. సీనియర్ల మధ్య పోటా పోటీ.. ఈ ఎన్నికల్లో తెలంగాణలో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్‌పార్టీ హైకమాండ్ ఫుల్‌ఫోకస్‌చేసింది. గెలిచే అభ్యర్థులకే టికెట్ ఇస్తామని కరాఖండిగా చెప్తూ సర్వేలు చేయించి మరీ టికెట్లు ఇస్తోంది. కొంత కాలంగా కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికకు భారీ కసరత్తే జరుగుతోంది. ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి, లిస్టులను కూడా మార్చి మళ్లీ వడపోస్తోంది. దీంతో కాంగ్రెస్ సీనియర్లు సైతం టికెట్‌కోసం దరఖాస్తు చేసుకుని లిస్టుల ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారు. అయితే ఇలాంటి సమయంలోనూ కాంగ్రెస్‌పార్టీ సీనియర్‌నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తనదైన మార్క్ చూపిస్తున్నారు. తన భార్యతో పాటు ఆయన వర్గీయులందరికీ టికెట్లు ఇప్పించుకోవడంలో సక్సెస్ అయ్యారు. ఆయన ఇప్పటి వరకు 20 మందికి పైగా తన వర్గీయులకు టికెట్లు ఇప్పించుకున్నారన్న చర్చ సాగుతోంది.

నెల రోజులుగా భారీ కసరత్తు..

కాంగ్రెస్‌లో సీట్ల కోసం గట్టిగానే కుస్తీ నడుస్తోంది. నెల రోజులుగా హైదరాబాద్ , ఢిల్లీలో జోరుగా కసరత్తు నడుస్తోంది. సీఈసీ మీటింగ్‌లలో కూడా సీట్ల కోసం యుద్ధ వాతావరణమే నెలకొంటోంది. ఎవరికి వారూ తమ టికెట్ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. సీనియర్ నేతలంతా హస్తినలో వాలిపోయి తమ పొలిటికల్‌గాడ్‌ఫాదర్స్‌తో మంత్రాంగం నడుపుతున్నారు. ఇలాంటి కీలక సమయంలోనూ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎలాంటి హంగామా లేకుండా కూల్‌గా అభ్యర్థుల ఎంపికలో చక్రం తిప్పుతున్నారు. నెలరోజుల కిందటి వరకు పార్టీ పీసీసీ ప్రెసిడెంట్ అయినా.. ఎన్నో ఒడిదొడుకులు, అవమానాలు ఎదుర్కొన్న ఉత్తమ్ ఒకానొక దశలో కాంగ్రెస్‌ను వీడి బీఆర్ లోకి వెళ్తున్నారన్న వార్తలు కూడా వచ్చాయి. కాంగ్రెస్‌పార్టీలో తనను వెళ్లగొట్టేందుకు సొంత పార్టీ వాళ్లే కుట్ర చేస్తున్నారని స్వయంగా ఉత్తమ్ కూడా కామెంట్‌చేశారు. దీంతో ఆయన పొలిటికల్‌కెరియర్‌ప్రశ్నార్థకమైందన్న విశ్లేషణలు కూడా జరిగాయి. కానీ ఈ ఒడిదొడుకులను అన్నింటినీ దాటుకుని ఉత్తమ్‌బెటర్‌ప్లేస్‌లో నిలబడ్డారు. పార్టీ హైకమాండ్ కు తనపై ఉన్న గట్టి నమ్మకం, పెద్దల పరిచయాలతో ఏఐసీసీ, సీఈసీ కమిటీలో మెంబర్‌గా ఎంపికయ్యారు. అభ్యర్థుల ఎంపికలోనూ ఒకే కుటుంబానికి రెండు టికెట్ల విషయంపై ఉత్తమ్, ఆయన సతీమణి పద్మావతి ఇద్దరికీ టికెట్లు ఇవ్వొద్దన్న చర్చ కూడా జరిగింది. పార్టీ గైడ్‌లైన్స్, ఉదయ్‌పూర్‌డిక్లరేషన్‌కు విరుద్ధంగా ఎలా టికెట్లు ఇస్తారని పీసీసీ చీఫ్‌రేవంత్ రెడ్డి కూడా ప్రశ్నించారు. దీంతో ఉత్తమ్, రేవంత్‌కు మధ్య వాగ్వాదం కూడా జరిగినట్లు వార్తలు వచ్చాయి. అయినా సరే ఆఖరికి ఫస్ట్‌లిస్టులోనే పద్మావతికి టికెట్‌కేటాయించడంలో ఉత్తమ్‌సక్సెస్‌అయ్యారు.

తన సతీమణితో పాటు తన టీమ్‌మెంబర్లందరూ.. 20 మందికి పైగా అభ్యర్థుల ఎంపికలో ఉత్తమ్ తనదైన ముద్ర వేశారన్న ప్రచారం నడుస్తోంది. ఇటీవల టికెట్ విషయంలోనే కాంగ్రెస్‌పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన భువనగిరి డీసీసీ ప్రెసిడెంట్ కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని తిరిగి పార్టీలోకి తీసుకువచ్చి టికెట్ ఇప్పించడంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కీలక పాత్ర పోషించారు. ఇలా ఆయన నల్గొండ పార్లమెంట్ సెగ్మెంట్‌తో పాటు మహబూబాబాద్ జిల్లాలోని పరకాల అభ్యర్థిగా చల్ల ధర్మారెడ్డికి టికెట్ ఇప్పించారు. ఆయనతో పాటు ఆయన అనుచరులందరికీ ఫస్ట్‌లిస్టులోనే టికెట్లు టికెట్లు వచ్చేలా చూశారు. ఆయా చోట్ల సీట్ల కోసం బీసీ నేతలు పట్టుపట్టినా కూడా సీఈసీ మీటింగ్‌లో అందరినీ ఒప్పించి అనుచరులకు టికెట్లు ఇప్పించుకోవడంలో ఉత్తమ్ సక్సెస్‌అయ్యారు.